## వాగులో ఆటో బోల్తా

తాంసి, అక్టోబర్ 3: మండలంలోని పొచ్చెర వద్ద బడి పిల్లలతో వెళ్తున్న ఆటో వాగులో బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పర్ల గ్రామానికి చెందిన గజానన్ ఆటోలో మంగళవారం రాంపూర్ గ్రామ సమీపంలోని కాన్వెంట్ స్కూల్ నుంచి విద్యార్థులను తీసుకెళ్లే క్రమంలో పొచ్చెర వద్ద ఆటోలోని బ్యాగ్ కింద పడింది. బ్యాగ్ కోసమని దిగిన డ్రైవర్ (ఓనర్) పర్ధాన్ గజానన్ బ్యాగ్ తీసే క్రమంలో ఆటో ప్రమాదవశాత్తు వాగులో పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే చిన్నారులను ప్రమాదం నుంచి తప్పించారు. ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే దవాఖానకు తరలించారు. ఘటనలో ఎవ్వరికీ ఏం కాకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఆడబిడ్డా అందుకో కానుక..

- నేటి నుంచి బతుకమ్మ చీరల పంపిణీ
- జిల్లా కేంద్రం నుంచి మండలాలకు సరఫరా
- రేషన్ దుకాణాల ద్వారా మహిళలకు ఇచ్చేందుకు ఏర్పాట్లు


లారీల నుంచి చీరెల మూటలను దింపుతున్న కూలీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ కానుకలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో 2,84,940 రేషన్ కార్డుదారులుండగా, ఈ నెల 4వ తేదీ నుంచి అందించనున్నది. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు వాహనాల ద్వారా వాటిని తెప్పించుకుంటున్నారు. డీఆర్‌డీఏ సిబ్బంది మండలాల వారీగా వేరు చేసి సరఫరా చేస్తున్నారు.

423 రేషన్ దుకాణాల ద్వారా...

జిల్లాలోని 423 రేషన్ దుకాణాల్లో బతుకమ్మ చీరలు అందజేయనున్నారు. బెల్లంపల్లి మండలంలోని 40 రేషన్ దుకాణాలతో పాటు కాసిపేటలోని 19, నెన్నెలలోని 14, చెన్నూర్‌లోని 30, కోటపల్లిలోని 29, భీమారంలోని 13, వేమనపల్లిలోని 12, కన్నెపల్లిలోని 15, లక్షెట్టిపేటలోని 24, జన్నారంలోని 23, దండేపల్లిలోని 34, మంచిర్యాలలోని 30, హాజీపూర్‌లోని 19, నస్పూర్‌లోని 17, జైపూర్‌లోని 17, మందమర్రిలోని 59, తాండూరులోని 18, భీమిని మండలంలోని 10 నిత్యావసర సరుకుల దుకాణాల ద్వారా పంపిణీ జరుగనుంది.

18 మండలాల్లో 2,84,940 చీరల పంపిణీ...

జిల్లాలోని 18 మండలాల్లో 2,84,940 మంది మహిళలకు బతుకమ్మ చీరలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తోంది. బెల్లంపల్లి మండలంలో 26,400 మంది మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. అలాగే భీమినిలో 5,209 మందికి, భీమారంలో 6,161 మందికి, చెన్నూర్‌లో 20,405 మందికి, దండేపల్లిలో 19,787 మందికి, హాజీపూర్‌లో 12,618 మందికి, జైపూర్‌లో 13,038 మందికి, జన్నారంలో 21,132 మందికి, కన్నెపల్లిలో 7,830 మందికి, కాసిపేటలో 11,761 మందికి, కోటపల్లిలో 13,778 మందికి, లక్సెట్టిపేటలో 19,354 మందికి, మంచిర్యాలలో 31,571 మందికి, మందమర్రిలో 30,244 మందికి, నస్పూర్‌లో 9,095 మందికి, తాండూరులో 11,730 మందికి, వేమనపల్లి మండలంలో 7,172 మంది మహిళలకు బతుకమ్మ చీరలు అందించనున్నారు.

# విజయవంతంగా ఓరియంటేషన్ ప్రోగ్రాం


పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 3: మంచిర్యాల జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల 2023-24 సంవత్సరానికి సంబంధించిన రెండో బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మంగళవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమం విజయవంతమైంది. కాలేజీరోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ దావుద్ సులేమాన్, జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డా.హరీశ్ చంద్రా రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు కళాశాల పూర్తి వివరాలను తెలియపరిచి, ర్యాగింగ్, ఇతరులతో ఎలా నడుచుకోవాలనే దానిపై పూర్తి అవగాహన కల్పించారు. విద్యార్థులకు వారి తల్లితండ్రులకు కళాశాల తరగతి గదులు, ల్యాబ్‌లు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల గురించి వివరించారు. బాగా చదువుకొని యువ వైద్యులుగా ప్రయోజకులు కావాలని కోరారు. నేటి నుంచి మొదటి సంవత్సర తరగతులు ప్రారంభమౌతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఆర్.జితేంద్ర, డా.రేఖ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.వీ మనోజ్ కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కాగజ్‌నగర్ ఆర్డీవో మృతి


రాజేశ్వర్ (ఫైల్)

ఉట్నూర్/కాగజ్‌నగర్, అక్టోబర్ 3: కుమ్రం భీం జిల్లా కాగజ్‌నగర్ ఆర్డీవో జాడి రాజేశ్వర్ (60) గుండెపోటుతో మంగళవారం తన ఇంట్లో ఉదయం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఉట్నూర్‌కు చెందిన జాడి రాజేశ్వర్ కాగజ్‌నగర్ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. గాంధీ జయంతి సెలవు దినం కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్లేందుకు రెడీ అవుతూ స్నానానికి బాత్‌రూంకి వెళ్లినట్లు తెలిపారు. ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు బాత్‌రూంలోకి చూడడంతో అప్పటికే గుండెపోటుతో మృతిచెంది పడి ఉన్నాడని చెప్పారు. రెవెన్యూశాఖలో చిన్న పోస్ట్ నుంచి ఆర్డీవో స్థాయికి ఎదిగిన రాజేశ్వర్ సౌమ్యుడిగా ఉమ్మడి జిల్లాలో మంచిపేరును తెచ్చుకున్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు, ఉట్నూర్ ఐటీడీఏ పీవో బాజ్‌పాయ్, ఉమ్మడి జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేశ్వర్‌కు సతీమణి, ఇద్దరు కుమారులు రమేశ్, నరేశ్, ఇద్దరు కుమార్తెలు గంగ, సదా ఉన్నారు. గతంలో ఆదిలాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వర్తించారు. అనంతరం కాగజ్‌నగర్ ఆర్డీవోగా ఆగస్టు 2022లో బాధ్యతలు చేపట్టారు. ఆయన మృతి పై కార్యాలయ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేసి అశ్రు నివాళులర్పించారు.

## కొనసాగుతున్న విచారణ


దుర్గం మధు(ఫైల్)

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 3: పట్టణంలో యువకుడి మృతికి కారణమైన తాంత్రికుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపారు. బొక్కలగూడెం కాలనీకి చెందిన దుర్గం లచ్చయ్య, లక్ష్మిల పెద్ద కొడుకు మధు (33) కొద్దిరోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. మధు వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక హాస్పిటల్‌లో చూపించుకున్నా తగ్గకపోవడంతో మధు కుటుంబీకులు శ్రీరాంపూర్‌కు చెందిన తాంత్రికుడిని ఆశ్రయించారు. స్థానిక గోదావరి తీరంలో రెండు రోజుల క్రితం రాత్రి క్షుద్రపూజలు చేయిస్తుండగా, తీవ్ర అస్వస్థతకు గురై మధు మృతి చెందాడు. క్షుద్రపూజల వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, సోమ వారం గోదావరి తీరంలో మృతదేహానికి అంత్యక్రియలు జరిపిస్తుండగా పోలీ సులు అడ్డుకోవడం పట్టణంలో చర్చనీయాంశమైంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబ సభ్యులు, తాంత్రికుడిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు సీఐ వాసుదేవరావు వెల్లడించారు.

## మహిళపై లైంగికదాడి కేసులో ఒకరికి జైలు

ఎదులాపురం, అక్టోబర్ 3 : దళిత మహిళపై లైంగికదాడికి యత్నం, సహ దొంగతనం కేసులో ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించింది. లైజన్ అధికారి జాదవ్ ఈశ్వర్ సింగ్ వివరాల ప్రకారం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని ఓ కాలనీలో ఎస్సీ మహిళపై 2023 ఏప్రిల్ 19వ తేదీన రాత్రి 12.30 గంటలకు అదే కాలనీకి చెందిన ఆకాశ్‌సింగ్ లైంగికదాడికి యత్నించాడు. అరిస్తే చంపుతానని బెదిరించాడు. అలాగే ఆమె ఇంట్లో బ్యాగులో ఉన్న రూ.3120 తీసుకొని పారిపోయాడు. మహిళ ఫిర్యాదు మేరకు కాగజ్‌నగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజ్యలక్ష్మి వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి నివేదిక అందించారు. ఆదిలాబాద్ ఎస్సీ ఎస్టీ కోర్టు పీపీఈ కిరణ్‌కుమార్ రెడ్డి తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువుకావడంతో ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పీ శివరాం ప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష ,రూ.1500 జరిమానా విధించారు.

## రెండు రోజుల్లో చోరీ ఛేదన

- వివరాలు వెల్లడించిన మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి


అరెస్ట్ చూపుతున్న సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐ

కాసిపేట, అక్టోబర్ 3 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెంలో అచ్చె అర్జయ్య ఇంట్లో జరిగిన దొంగతనం కేసును రెండు రోజుల్లోనే కాసిపేట పోలీసులు ఛేదించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మందమర్రి పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ మహేందర్ రెడ్డి వెల్లడించారు. 30వ తేదీ అర్జయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగులగొట్టి బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన ఏదుల దీపక్, కన్నాలకు చెందిన మ్యాకల అశోక్, తాండూర్ అంకుశంకు చెందిన ముద్దం సాయి కిరణ్ బంగారం, వెండి దొంగతనం చేసినట్లు వివరించారు. దుండగులను చాకచక్యంగా గుర్తించి అరెస్ట్ చేసి బంగారం, వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు అలవాటు పడి వీరు దొంగతనం చేసినట్లు వివరించారు. నిందితులను పట్టుకోవడంలో శ్రమించిన కాసిపేట ఎస్ఐ గంగారాం, హెడ్ కానిస్టేబుల్ అజయ్, కానిస్టేబుల్లు మల్లికార్జున్, కిరణ్ కుమార్, శ్రీనివాస్, సంపత్‌ను అధికారులు అభినందించారు.

## అన్నకు ఐదేండ్ల జైలు

నెన్నెల,అక్టోబర్ 3: నెన్నెల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన బద్దం లక్ష్మారెడ్డి, బద్దం బాపు రెడ్డి అన్నదమ్ములు . భూ పంపకాల్లో వచ్చిన తగాదాల్లో తమ్ముడు లక్ష్మారెడ్డిని చంపాలనే బాపురెడ్డి కుట్ర పన్నాడు. 2018 జూన్ 13న నెన్నెలలోని తహసీల్ కార్యాలయంలో తన భూమి విరాసత్‌కోసం వెళ్లి వస్తున్న లక్ష్మారెడ్డిపై దాడి చేసి కారంపొడి చల్లి కత్తితో చంపడానికి బాపురెడ్డి యత్నించాడు. ఈ కేసులో నేరం రుజువైనందున మంచిర్యాల అసిస్టెంట్ సెషన్ కోర్టు బాపురెడ్డికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించినట్లు నెన్నెల ఎస్ఐ పుప్పాల శ్యాంపటేల్ తెలిపారు. అప్పటి ఎస్ఐ చందర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి నిందితుడిపై చార్జీషీట్ ఫైల్ చేశాడు. లక్ష్మణ్ పీసీ సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో, దోషికి శిక్ష ఖరారైంది.

## భార్యను వేధించిన భర్తకు ఆరు నెలల జైలు

ఎదులాపురం, అక్టోబర్ 3 : భార్యను వేధించిన కేసులో భర్తకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తున్నట్లు జేఎఫ్‌సీఎం ప్రత్యేక పీసీఆర్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి తీర్పు వెలువరించినట్లు కోర్టు లైజన్ అధికారి ఎం గంగాసింగ్ తెలిపారు. కేసు వివరాలను లైజన్ అధికారి వెల్లడించారు. 2011 సంవత్సరంలో కామారెడ్డి జిల్లా బికనూర్‌కు చెందిన అహ్మద్‌పాషాకు ఆదిలాబాద్‌లోని రవీంద్రనగర్‌కు చెందిన అస్మాఖానంతో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు జన్మించిన తర్వాత భర్త అహ్మద్‌పాషా రోజు మద్యం తాగి వచ్చి కొట్టడం, తిట్టడంతో పాటు అదనపు కట్నం రూ.50వేలు తీసుకురావాలని మానసికంగా వేధింపులకు గురి చేసేవాడు. దీంతో భార్య మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో పలుసార్లు కౌన్సెలింగ్ చేశారు. అయినప్పటికీ భర్త మరకపోవడంతో 22 జనవరి 2016 ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ డీ పద్మ కేసు నమోదు చేశారు. ఏపీపీ ఎం నవీన్ ఆరుగురు సాక్షులను కోర్టులో హాజరుపరచగా మంగళవారం న్యాయమూర్తి దుర్గారాణి జరిమాన విధిస్తున్నట్లు తీర్పును వెలువరించింది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబీ కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-310380-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677